క్లుప్తంగా

ఐకమత్యంతో వినాయక చవితి నిర్వహించుకోవాలి

ఎస్‌ఐ వెంకట్

పెదవడ్లపూడి (మంగళగిరి): మత సామరస్యం పరఢవిల్లేలా వినాయక చవితి పండుగను ఘనంగా ఐకమత్యంతో నిర్వహించుకోవాలని రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. మండలంలోని పెదవడ్లపూడి, చినవడ్లపూడి గ్రామాలలో ఆదివారం వినాయక చవితి ఉత్సవాలపై ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకట్ మాట్లాడుతూ వినాయక చవితి మొదలు గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవం వరకు వేడుకలను కులమతాలు, రాజకీయాలకు అతీతంగా నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకరిని ఒకరు రెచ్చగొట్టుకుని వివాదాలకు దిగితే కేసులు నమోదు చేయడంతో పాటు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ జువ్వాది కిరణ్ చంద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తుళ్ళూరు సీఐ శ్రీనివాసరావు

వివాదరహితంగా వినాయక చవితి నిర్వహించాలి



తాడికొండ: వివాదరహితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు సహకరించాలని తుళ్ళూరు సీఐ కె.శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ఉత్సాహంగా నిర్వహించుకునేందుకు ఇప్పటికే పలువురు ఆన్‌లైన్‌లో అనుమతులు కోరడం జరిగిందని, ప్రజలకు ఇబ్బంది కలగించేలా డీజేల ఏర్పాటు, వివాదాస్పద ప్రదేశాలలో విగ్రహాలను ఉంచడం, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. మండపం వద్ద కమిటీ సభ్యుల నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని భక్తిశ్రద్ధలతో పండుగ జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

పసుపు యార్డు చైర్మన్ ఝాన్సీరాణికి సన్మానం



దుగ్గిరాల: పసుపు యార్డు చైర్మన్ ఉన్నం ఝాన్సీరాణి, వెంకయ్య దంపతులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. దుగ్గిరాల పోలీసు స్టేషన్ సమీపంలోని సభా వేదిక వద్ద ఆదివారం ఆమెకు ఘనంగా సన్మానం నిర్వహించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పేద్దేటి యోహోను, ఇందుపల్లి రాజారావు, మంచికలపూడి వెంకటేశ్వరరావు, మరియదాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

తెనాలి: వాసవి క్లబ్, కైలాసగిరి ఆధ్వర్యంలో గవర్నర్ విజిట్ సందర్భంగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్, హైదరాబాద్‌తో ఆదివారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఏర్పాటైన శిబిరంలో 300 మందికి క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. జిల్లా గవర్నర్ పులికొండ శ్రీనివాసరావు, ఆర్‌సీ మున్నలూరి గౌరీశంకర్ తదితరులు హాజరయ్యారు. శిబిరానికి వాసవి క్లబ్ సభ్యులు, హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు సహకరించారు. కార్యక్రమంలో చార్టెడ్ అధ్యక్షుడు శ్రీకాకొలను లక్ష్మీనారాయణ గుప్తా, అధ్యక్షుడు చుండూరి వెంకట శివప్రసాద్, కార్యదర్శి కొత్తమాసు వినోద్, కోశాధికారి చుండూరి రఘురాం గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

యానాదుల సంక్షేమానికి కృషి



పొన్నూరు: యానాది వర్గీయుల సంక్షేమమే లక్ష్యంగా యానాదుల (గిరిజన) యూత్ ఫెడరేషన్ పనిచేస్తుందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండేటి వెంకట సుబ్బయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో ఫెడరేషన్ రాష్ట్రకార్యవర్గం సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, విధివిధానాల గురించి చర్చించారు. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని యానాదులందరికీ ఆధార్, రేషన్, జాబ్ కార్డులు ఉండేలా చేసి సంక్షేమ పథకాలకు యానాదులను చేరువ చేయటమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులకు సూచించారు. యానాదుల అభివృద్ధి, ప్రధాన వృత్తి చేపల వేటలో సొసైటీల ఏర్పాటుపై, గ్రామ స్థాయి నుంచి అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమరగిరి వెంకటప్రసాద్, కొమరగిరి సూరిబాబు, నాయకులు చౌటూరు రమేష్, ఏకుల నిరంజన్, రాపూరి గోపి, కొమరగిరి మరియమ్మ, కాకుమాను మండల నాయకులు శివయ్య, యలమందయ్య, కొండలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



క్యూఆర్ కోడ్ ప్రదర్శిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి



సమావేశంలో కార్యకర్తలు, ప్రజలు

దుగ్గిరాల: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. దుగ్గిరాల మండలం మోరంపూడి, దుగ్గిరాల గ్రామాలలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీవీఆర్ పార్టీ నాయకులతో కలిసి ముందుగా క్యూఆర్ కోడ్‌ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అబద్ధపు హామీలతో ప్రభుత్వం ప్రజలను తీవ్రంగా మోసం చేస్తుందని, మోసాన్ని ఇంటింటికి వెళ్లి ప్రతి కార్యకర్త ప్రజలకు తెలియజేయాలని, ఏడాది దాటినా ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేదని తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు కేవలం రూ.2 వేలు, రూ.5 వేలు మాత్రమే ఇచ్చారని మిగిలిన డబ్బు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉచిత బస్సు కొన్ని బస్సులకు మాత్రమే ఇవ్వడంతో మహిళలు ఎక్కువ సేపు ఎదురు చూడాల్సి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో సుమారు 1.60 లక్షల దివ్యాంగులకు, వివిధ కారణాలతో 4.15 లక్షలు మందికి సామాజిక పింఛన్లు ఎందుకు నిలుపదల చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహానేత రాజశేఖర్ రెడ్డి ప్రజల కోసం ఒక అడుగు ముందుకు వేస్తే వారి తనయుడు మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి మరో రెండు అడుగులు ముందుకు వేసి పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమం అందించి మన్ననలు పొందారని తెలిపారు. ఒక్కసారి పొరపాటుగా కూటమికి ఓటు వేయడం ద్వారా ఈ 5 సంవత్సరాలు ఇబ్బందులు తప్పవని అన్నారు. రాష్ట్రంలో అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతూ, దౌర్జన్యాలకు పాల్పడుతూ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చిలువూరు ఫిలోమిన, బీసీ సెల్ మండల నాయకులు నడికుడి వెంకట్రావు, ఎస్సీ సెల్ మండల మహిళా అధ్యక్షురాలు పి.సంసోనమ్మ, మోరంపూడి గ్రామ సర్పంచ్ ఇత్తడి చంటి, ఎంపీటీసీ సభ్యులు కె.సురేష్, మోరంపూడి వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు దుగ్గి మహిధర్, దుగ్గిరాల గ్రామ అధ్యక్షుడు ఆత్మకూరి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎ.ధనుంజయ్, షేక్ సుభాని, మల్లవరపు నాగరాజు, కె.రవి, చినబాబు, ఫణీంద్ర, ఏసుబాబు, సతీష్, నజీర్, శ్రీనివాస రెడ్డి, రామకోటి రెడ్డి, షేక్ హుస్సేన్, పాముల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



చినకాకాని రోడ్డును తవ్విన అధికారులు



శనివారం రాత్రి గుంతలో పడ్డ ద్విచక్ర వాహనం

- చినకాకాని రోడ్డును తవ్విన అధికారులు
- వరద నీరు మళ్లించేందుకు తవ్వి పూడ్చకుండా వదిలేసిన వైనం
- గుంతలో పడి గాయాలపాలవుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

చినకాకాని(మంగళగిరి): మండలంలోని చినకాకాని యార్లగడ్డ సుబ్బారావు రోడ్డు పక్క రోడ్డును తవ్వి పూడ్చకుండా వదిలివేశారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దాదాపు 10 రోజుల క్రితం వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు అధికారులు గుంత తీశారు. అయితే వర్షాలు, వరదలు తగ్గి రోజులు గడుస్తున్నా గుంతను పూడ్చకుండా వదిలేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వరద నీరు బయటకు వెళ్లినా అధికారులు గుంత పూడ్చకపోవడంతో ద్విచక్ర వాహనదారులకు ప్రాణగండంగా మారిందని, నడిరోడ్డును తవ్వడంతో ప్రతి రోజు రాత్రి ద్విచక్ర వాహనదారులు పడి గాయాలపాలవుతున్నారని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నగర పాలక సంస్థ అధికారులతో పాటు సచివాలయ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తూ గుంతలో పడి ఓ వ్యక్తికి రెండు కాళ్లు విరిగిపోయాయి. ఇప్పటికి 10 మందికిపైగా ద్విచక్ర వాహనదారులు గుంతలో పడి గాయాలపాలయ్యారని అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే గుంతను పూడ్చి రోడ్డు వేసి తమ ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదానం అంటే ప్రాణ దానం

మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి



రక్తదానం చేసిన వారికి అభినందన పత్రం అందజేస్తున్న గంజి చిరంజీవి తదితరులు

చినకాకాని(మంగళగిరి): రక్తదానం చేయడమంటే మరొకరి ప్రాణం నిలబెట్టినట్లేనని మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి తెలిపారు. ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ బీకే దాది ప్రకాశమణి 18వ పుణ్యస్మృతి సందర్భంగా ఆదివారం మండలంలోని చినాకాకాని ఎన్ఆర్ఐ సెంటర్‌లోని ప్రైవేటు హోటల్‌లలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన చిరంజీవి దాతలకు అభినందన పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ దాతలు వెచ్చించే కొన్ని నిమిషాలు ఇతరులకు జీవితాన్ని ప్రసాదిస్తాయన్నారు. దాతలు ఇచ్చేది కేవలం రక్తం కాదని, జీవించేందుకు మరొక అవకాశం అని పేర్కొన్నారు. 22వ తేదీ 25 వరకు దేశవ్యాప్తంగా 15 వేల బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాలలో ఒకేసారి భారీ రక్తదాన శిబిరాలు నిర్వహించబడుతున్నాయన్నారు. ఈ ప్రచార లక్ష్యం 1లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించడమేనన్నారు. కార్యక్రమంలో రెయిన్ బో బ్లడ్ బ్యాంక్ చైర్మన్ కనిగంటి వెంకటేశ్వర్లు, డాకర్లు సి.రామచంద్, నవీన్, ఏఎస్ఎన్ రెడ్డి, బీకే నాగమణి, బీకే రత్న తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు

ఎస్‌ఐ హరిబాబు

మంగళగిరి: బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగి ప్రజలను ఇబ్బందికి గురిచేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పట్టణ ఎస్‌ఐ హరిబాబు తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణంలోని రాజీవ్ గృహకల్ప కాలనీ, ఆటోనగర్ ప్రాంతాలలో బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న పలువురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. బార్‌లతో పాటు వైన్స్‌లోను పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగాల్సిన అవసరం ఎందుకు వస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెవి, ముక్కు, గొంతు సమస్యలపై అవగాహన

లక్ష్మీపురం: చెవి, ముక్కు, గొంతు సమస్యలపై అవగాహన అవసరమని సీనియర్ పల్మనాలజిస్ట్ సర్జన్ వి.వి.కె.సందీప్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పెద్దలలో ముక్కు దూలం వంకరగా ఉండటం, సైనసైటిస్ లాంటి సమస్యలు వస్తున్నాయని, ముక్కు దూలం వంకరగా ఉంటే శ్వాస సరిగా వెళ్లక ఇబ్బందికి గురవుతారని దీనికి శస్త్ర చికిత్స అందుబాటులో ఉందని చెప్పారు. అనంతరం డాక్టర్ సందీప్‌ను అవగాహన సభ్యులు ఘనంగా సత్కరించారు. టీవీ సాయిరాం కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. వేమన ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు ప్రసంగించారు.

కూలిన వృక్షం.. నిలిచిన వాహనాలు



అడ్డంగా విరిగి పడిపోయిన భారీ వృక్షం



కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

దుగ్గిరాల: విజయవాడ–తెనాలి రహదారిలో దుగ్గిరాల లాకుల వద్ద ఆదివారం సాయంత్రం భారీ వృక్షం విరిగి పడిపోయింది. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడం వేరే ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో వృక్షం తొలగించే వరకు సుమారు గంటకు పైగా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రమాదంలో తమ్మా శంకర్‌కు గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రంగా విగ్రహాన్ని అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కాపు సంఘం నాయకులు చందు సాంబశివరావు



రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కాపు నాయకులు

మంగళగిరి: సమాజంలో కాపుల గౌరవాన్ని ఇనుమడింపజేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాలను అపవిత్రం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని కాపు సంఘం నాయకులు చందు సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లిప్తత కారణంగానే రాష్ట్ర వ్యాప్తంగా రంగా విగ్రహాలకు అవమానం జరుగుతుందన్నారు. కైకలూరు నియోజకవర్గం రుద్రవరం గ్రామంలో కొందరు దుండగులు రంగా విగ్రహాన్ని అపవిత్రం చేశారని, వారిని శిక్షించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రంగా విగ్రహాన్ని అపవిత్రం చేయడంపై ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట రంగా విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు తిరుమలశెట్టి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బాబాయిపై దాడి



లక్ష్మీపురం: చెడు అలవాట్లు మానుకోమని మందలించిన బాబాయిపై కత్తితో దాడి చేసిన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు... గుంటూరు శారదాకాలనీ 7వ లైన్‌కు చెందిన షేక్ సిలార్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన సిలార్ సోదరుడి కుమారుడు హుస్సేన్ ఇటీవల చెడు వ్యసనాలకు బానిస అయ్యాడు. ఈ విషయం తెలిసిన బాబాయి సిలార్, హుస్సేన్‌ను చెడు అలవాట్లు మానుకోవాలని మందలించాడు. దీంతో హుస్సేన్, బాబాయి సిలార్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. రక్తపు మడుగులో ఉన్న సిలార్‌ను స్థానికుల జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స అనంతరం సిలార్ అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో ఘనంగా ఫౌండర్స్ డే



మొక్కలు నాటుతున్న వీసీ డాక్టర్ సతీష్‌కుమార్ తదితరులు

నీరుకొండ(మంగళగిరి): మంగళగిరి మండలం నీరుకొండ గ్రామంలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఆదివారం విద్యాలయ వ్యవస్థాపకులు డాక్టర్ టీఆర్ పారివేందర్ జన్మదినం సందర్భంగా ఫౌండర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీతో పాటు నీరుకొండ, కురగల్లు, నిడమర్రు గ్రామాలలో భారీగా మొక్కలు నాటారు. ఆయా గ్రామాలలో ఉచితంగా నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్లలో చిన్నారులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. నిడమర్రులోని క్రిష్టియానా చిల్డ్రన్స్ హోమ్‌కు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. వృద్ధాశ్రమాలలో వృద్ధులకు పండ్లు, నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. వర్సిటీ ముఖ్య సలహాదారు డాక్టర్ వీఎస్ రావు రూ.5 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రొ వీసీ డాక్టర్ సతీష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, డైరెక్టర్లు అనూప్‌సింగ్, గురుదీప్‌సింగ్, పంకజ్ బల్వేరియా, రేవతీబాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో స్కిల్ పలావర్ ప్రాజెక్ట్



స్కిల్ పలావర్ ప్రాజెక్ట్‌ను వివరిస్తున్న కేఎల్‌యూ విద్యార్థి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో స్కిల్ పలావర్ ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాస హ్యాకథాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ కేఎల్‌యూలోని నైపుణ్య అభివృద్ధి విభాగం ద్వారా, సీఎస్ఈ, ఈసీఈ, ఏఐ డీఎస్, సీఎస్ఐటీ, ఐవోటీ విభాగాలలోని బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం రూపొందించబడిన ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాస చొరవ స్కిల్ పలావర్ కార్యక్రమం మొదటి దశను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. పలావర్ అనేది విద్యార్థులలో స్వీయ నిర్దేశిత అభ్యాసమని పేర్కొన్నారు. ప్రీ ఫైనల్ సంవత్సరం వారిని పరిశ్రమకు సిద్ధంగా ఉంచవచ్చునని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్కిల్ పలావర్ మరో దశ సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మూడు దశలుగా రూపకల్పన చేశామని, మొదటిది లెర్నథాన్, రెండవది వర్చువల్, మూడవది హ్యాకథాన్ అని వివరించారు. ఈ కార్యక్రమానికి కేఎల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేష్ కన్వీనర్‌గా వ్యవహరించాగా సీఎస్ఈ, ఈసీఈ, ఏఐ డీఎస్, సీఎస్ఐటీ, ఐవోటీ విభాగాల అధిపతులతో పాటు ఇతర అనుబంధ డొమైన్‌ల విభాగాధిపతులు, స్పాక్‌ల బృందంతో కలసి అవగాహన కల్పించారు. వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీలు డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు మార్గదర్శకత్వం వహించారు.

మంత్రి చొరవతో మోటార్ల మరమ్మతులు



మరమ్మతులు నిర్వహించిన విద్యుత్ మోటార్లు

తాడేపల్లిరూరల్: ఐటీ, విద్యా శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ చొరవతో తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ విద్యుత్ మోటార్ల మరమ్మతులను ఆదివారం నిర్వహించారు. ఈ నెలలో రైతులకు సాగునీటిని అందించాలనే ఉద్దేశంతో తన సొంత నిధులతో 150 హెచ్‌పీ మోటార్లకు మరమ్మతులతో పాటు నూతన పైపులైన్ ఏర్పాటు చేయించారు. దీంతో తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మంగళగిరి రూరల్ నూతక్కి, రామచంద్రాపురం గ్రామాల పరిధిలో సుమారు 3,600 ఎకరాలకు సాగునీరు విడుదల చేయనున్నారు. మోటార్లకు మరమ్మతులు నిర్వహించి, నూతన పైపులైన్ ఏర్పాటు చేసినందుకు రైతులు, స్థానికులు మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

కూటమి గెలుపులో కాపు సామాజికవర్గం కీలక పాత్ర

కాపుల ఆత్మీయ సమావేశంలో కాపు నాయకులు



కాపుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కాపు సామాజికవర్గ నాయకులు

మంగళగిరి టౌన్: ఓట్లు వేసి కూటమి పార్టీలకు అధికారం కట్టబెట్టిన విషయంలో కాపు సామాజికవర్గం కీలక పాత్ర పోషించిందని పలువురు కాపు నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఆటోనగర్ వద్ద కాపు సంఘం కార్యాలయంలో ఆదివారం కాపుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాపు సామాజికవర్గ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కీలక పాత్ర పోషించిన కాపు సామాజికవర్గానికి సరైన ప్రాధాన్యత లేదని, చిన్న చూపు చూస్తున్నారనే అభిప్రాయం కాపుల్లో వ్యక్తమవుతోందన్నారు. కాపు సామాజికవర్గానికి సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. స్థానిక పరిస్థితులను జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కాపు కార్పొరేషన్‌కు నిధులను పునరుద్ధరించాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో కాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, కాపులకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో కృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు చందు సాంబశివరావు, కాపు సంఘం మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షుడు తిరుమలశెట్టి కొండలరావు, రంగిశెట్టి ఫౌండేషన్ అధినేత రంగిశెట్టి రమేష్, ఏపీఎస్పీ రిటైర్డ్ ఆర్ఐ కృష్ణారావు, కాపు సంఘం నాయకులు మొహమాటం అనిల్, జొన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు లీకేజీ... పట్టని అధికారులు



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ ఉండవల్లి దళితవాడలో వాటర్ ట్యాంక్ నుంచి నివాసాలకు సరఫరా చేసే పైప్‌లైన్ దగ్గర వాటర్ లీకేజీ అవుతోంది. దీంతో తాగునీరు వృథాగా పోతుందని స్థానిక ప్రజలు అంటున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి వాటర్ లీకేజ్ అలాగే కొనసాగడంతో రోడ్డుపై పాకుడు పట్టి జారుతోందని పలువురు చెబుతున్నారు. దళితవాడలో బత్తుల నీలమ్మ, వాసుపల్లి శాంసన్, గద్దం తంబి నివాసాల మధ్య మూడు రోడ్లలో ఈ వాటర్ లీకేజ్ వల్ల ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.